# రాబోయే వసంతం

ఉరుములేని పిడుగులాగా ఊడిపడ్డాడు సుబ్బారావు. దీక్షగా కాగితాలు రాసుకుంటున్న శ్రీనివాసు తలెత్తి చూశాడు. ఎదురగా వున్న కుర్చీలో కూర్చోమని సైగ చేశాడు.

" శీనూ ! నేను కూర్చోవడానికి రాలేదు. నేను ఊరికి వెళుతున్నాను. నీతో చెప్పేసి పోదామని వచ్చాను.. గుడ్‌బై !" కంగారుగా చెప్పాడు సుబ్బారావు.

" సుబ్బారావు ! ఆల్‌ది బెస్టు ... ఊరికి ఎన్నోసార్లు వెళుతూ వుంటావు, కాని ఈసారి నాతో చెప్పి పోదామని ఎందుకు వచ్చావు" ఆశ్చర్యంగా అడిగాడు శీను.

" మనం కల్సుకునేది ఇదే చివరిసారి కాబట్టి.." దీర్ఘంగా నిట్టూర్చాడు.

" సుబ్బా ! నీ ధోరణి నాకు అర్థం కావడం లేదు... కాస్త వివరంగా చెప్పు" శీను రాయడం ఆపి అడిగాడు.

" శీనూ ! నేను ఓడిపోయాను. జీవితంలో ఓడిపోయాను. జీవితమనే క్రికెట్‌లో డకౌట్ అయ్యాను. సెంచరీ చేద్దామని ఎంతో ఆశతో జీవితంలో బ్యాటింగ్ ప్రారంభించాను.. కాని విధి అనే బౌలరు నన్ను క్లీన్ బౌల్డు చేశాడు ఒక్క పరుగు కూడా చేయకుండా!" బాధపడ్డాడు సుబ్బారావు. కుర్చీలో కూర్చుంటూ.

" సుబ్బా ! వరల్డ్ కప్‌లో మనవాళ్ళు ఓడిపోయినంత మాత్రాన ఇంత క్రికెట్ వైరాగ్యం పెట్టుకుంటే ఎలా? ఇంకోసారి గెలుస్తారు" ఓదార్చాడు శీను.

" నిజమే ! మనవాళ్ళు ఇంకోసారి గెలవచ్చు... కాని అది చూడ్డానికి ఈ సుబ్బారావు వుండడుగా" నిర్వేదనతో చెప్పాడు అతను.

" నిన్నేమన్నా పిచ్చికుక్క కరిచిందిరా... ఒక్కముక్క అర్థం కాకుండా మాట్లాడుతున్నావు?" శ్రీనివాసు విసుగ్గా అడిగాడు.

" అర్థంగాంది నీకే ! నేను వచ్చినపని ఏమిటంటే ... ఐదు లక్షల పాలసీ చేయించావు. రెగ్యులర్‌గా ప్రీమియంలు చెల్లిస్తున్నాను" చెప్పాడు సుబ్బారావు.

" ఓ ! ఇన్‌కంటాక్స్ సర్టిఫికెట్టు కావాలా?" శీను అసహనంగా అడిగాడు.

" కాదు .. క్లెయిమ్ సెటిల్ చేయించాలి! మా వాళ్ళకు భద్రంగా డబ్బులు ఇప్పించాలి... నేను పోయింతర్వాత ఆ ఫారము.. ఈ ఫారము తెమ్మని మా వాళ్ళను సతాయించవద్దు... అవన్నీ నువ్వే చూసుకో !" చెప్పాడు సుబ్బారావు.

" సుబ్బా ... ఇటీజ్ టూమచ్ ! అసలేం జరిగింది?" అడిగాడు శీను.

" నాకు టైం లేదు... నేను ఆత్మహత్య చేసుకో బోతున్నాను ... మా ఊరికిపోయి

పురుగుల మందు తాగుతాను!" చెప్పాడు బాధగా సుబ్బారావు.

" ఏం పురుగుల మందు ఇక్కడ దొరకదా! ఇది సిటీ కాదా!" హాస్యంగా అన్నాడు శ్రీనివాసు.

" డోంట్ బీ సిల్లీ శీను! ఇక్కడ ఛస్తే మళ్ళీ నా శవాన్ని అంతదూరం తీసుకు పోవడానికి లేనిపోని ఖర్చు దండుగ... ఇప్పటికే మా నాన్నగార్కి పొలం మీద నష్టం వచ్చింది. ఈ ఏడు రామ్ములక్కాయలు విపరీతంగా పండాయి. కిలో పావలాకు అమ్మినా కొనేవాడు లేడు అక్కడ!" చెప్పాడు సుబ్బారావు.

" అదేంటి... ప్రొద్దున కిలో పది రూపాయలు పెట్టి కొనుక్కొచ్చాను టమోటాలను" ఆశ్చర్యంగా చెప్పాడు శ్రీనివాసు.

" నువ్వు చెప్పింది నిజమే ! రాత్రింబవళ్ళు కష్టించి పనిచేసిన రైతుకు గిట్టుబాటు ధర కూడా పలకడం లేదు, కాని మధ్యలోని దళారులు బాగా దోచుకుంటున్నారు. సామాన్య మానవులకు ధరలు అందుబాటులో లేకుండా ఈ దళారులు అడ్డుపడుతున్నారు. అయినా అవన్నీ నా కెందుకులే, నా కసలే టైం లేదు, నేను అర్జంటుగా పైకి పోవాలి!" సుబ్బారావు కుర్చీలోంచి లేస్తూ చెప్పాడు.

" సుబ్బా ! స్కూలుకు సెలవులిచ్చారా? ఊరికి వెళుతున్నావా?"

" అవును. రేపటినుండి సెలవులు. రెండు నెలల్లో తెరుస్తారు. కాని అప్పుడు ఈ సుబ్బారావు జాయిన్ కాడు, ఆహా కాలేడు... ఎందుకంటే వీడు ఈ భూప్రపంచం మీద వుండడు" బాధపడుతూ చెప్పాడు సుబ్బారావు.

" సుబ్బారావ్ ! ఆత్మహత్య చేసుకునేటంత కష్టం నీకేమొచ్చింది?"

" శీనూ ! ఎందుకడుగుతావులే ! కష్టపడి యమ్మే బియెడ్ చేసి, ఆపైన డాక్టరేట్ కూడా చేస్తున్నాను. నన్ను చదివించడానికి పొలంమీద అప్పుచేశాడు మానాన్న ! వ్యవసాయం వర్షాధారం, మనసీమలో ఎప్పుడు పంటలు బాగా పండుతున్నాయి? పంటల కోసం చేసిన అప్పులు ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఇంతా ఉద్యోగం చేసి నేను ఏదో ఉద్ధరిస్తానని మా వాళ్ళు ఆశ పెట్టుకుంటే ముష్టి అయిదువేలకు ఓ ప్రైవేటు స్కూల్లో తుమ్మితే ఊడే ముక్కులాంటి ఉద్యోగం దొరికింది. మూడేళ్లుగా అఘోరిస్తున్నాను, ఏమీ గిట్టుబాటు లేదు. బయటి ఉద్యోగాలు దొరకడం లేదు... ఇన్నాళ్ళు గొప్ప ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో నెట్టుకొచ్చాను. కాని నిన్నటితో ఆ ఆశ కూడా హుళక్కి అయిపోయింది. ఇంక నేనెందుకు జీవించాలి? కాకిలా కలకాలం బ్రతికేకంటే ... ఆత్మహత్య చేసుకుంటే ఈ కష్టాలు తెలియవు" తన బాధ వెళ్ళబోసుకున్నాడు సుబ్బారావు.

శ్రీనివాసు అతనికి నచ్చచెప్పడానికి చాలాసేపు ప్రయత్నించాడు. కాని అతని

ఆవేశం ముందు శ్రీనివాసు అభ్యర్థన ఫలించలేదు. చివరి ప్రయత్నంగా శ్రీనివాసు అన్నాడు.

" చూడు సుబ్బారావ్ ! నువ్వంటే నాకు చాలా అభిమానం! ఎందుకంటే నేను ఏజెన్సీ తీసుకుని పాలసీలు చేయించలేక బాధ పడుతున్న తొలిదినాలలో నాకు పెద్ద పాలసీ.. ఐదు లక్షల పాలసీ  ఇచ్చి నన్ను ప్రోత్సహించావు. నీ బోణీతో నేను ఈనాడు చాలా పెద్ద ఏజెంటుగా ఎదిగి, జీవితంలో బాగా స్థిరపడ్డాను. పైగా మా వూరు కూడా మీ వూరు ప్రక్కనే ! అలా పాలసీతో మొదలైన పరిచయం మన మధ్య మంచి స్నేహంగా మారింది. అందుకని నీ రుణం తీర్చుకోదల్చుకున్నాను... నాతో రెండు రోజులు గడువు. నీకు మంచి పార్టీలు ఇస్తాను, కాదనకు".

" నిజమే. కాని నా చావుకు ముహూర్తం పెట్టుకున్నాను. ఆలశ్యం అయిపోతుంది, వచ్చే జన్మలో నీ పార్టీ తీసుకుంటాను" సుబ్బారావు తిరస్కరించాడు.

" అంటే నన్ను రుణగ్రస్తుడిని కమ్మంటావా? విశ్వాస ఘాతకుడిలాగా జీవితాంతం బాధపడమంటావా? ఎలాగు చస్తున్నావు... నువ్వు ఎవరి మాట వినిచావవు ! కనీసం కమ్మగా రెండు రోజులు కడుపునిండా తిని, జీవితం అనుభవించి చావు. ఏం? అలా చేస్తే ఆత్మహత్య మీద మనసుపోదని భయపడుతున్నావా? నీ క్షణికావేశం తగ్గిపోతుందని విచారిస్తున్నావా?" శ్రీను వంకరగా నవ్వుతూ అడిగాడు.

" చూడు శీను ! నాది క్షణికావేశం కాదు. ఒక సంవత్సరంగా ఆలోచించి తీసుకున్న తిరుగులేని నిర్ణయం. నీలాంటి వాళ్ళ మాటలకు, ఒకటి రెండు రోజులకు మారేది కాదు. సరే, నువ్వు ఛాలెంజి చేస్తున్నావు కాబట్టి రెండు రోజులు నీతో గడిపే ఛస్తాను" సుబ్బారావు ఒప్పుకున్నాడు.

★★★★★

గడియారం ఒకటిన్నర చూపిస్తున్నది.

వెంటనే శ్రీనివాసు సుబ్బారావును తీసుకుని మంచి హాస్యరసం గల సినిమాకు వెళ్ళాడు.. అంతకు ముందు మంచి హోటల్లో మంచి భోజనం తినిపించాడు. వస్తూ వస్తూ తనకు తెల్సిన నగరానికి చాలా దూరంలో వున్న ఓ కేర్ హోమ్‌కు తీసుకువెళ్ళాడు... అది అంతకు ముందు సుబ్బారావు చూసి ఉండలేదు.

" చూడు సుబ్బూ ! ఇక్కడ పసిపిల్లల నుంచి వయసు వచ్చిన పిల్లల దాకా ఉన్నారు... నేను రెగ్యులర్‌గా వీళ్ళకు దొనేషన్లు ఇస్తూ ఉంటాను... నువ్వు కూడా ఏవన్నా యివ్వదల్చుకుంటే ఇవ్వు " అంటూ లోపలికి నడిచాడు.

ఒక పెద్ద హాల్లో చాలా మంది ఉన్నారు. కొందరు ఆటలు ఆడుతున్నారు. ఇంకొందరు ఏడుస్తున్నారు. కొందరు కొట్లాడుతున్నారు.

అందరూ ఆశ్చర్యంగా వీరిద్దరి వైపు చూస్తున్నారు. కొంత మంది భయపడి పక్కకి దాక్కున్నారు. కాని వారి చూపుల్లో ఏదో తేడా!

"శీనూ ! ఏం వీళ్ళకి మెంటలా? నన్ను చూసి భయపడుతున్నారు?" అసహనంగా అరిచాడు సుబ్బారావు.

"ఆ ! మెంటల్ కాదు, మెంటల్లీ రిటార్టెడ్ అంటే మానసిక వికలాంగులు. మనసు ఎదగలేదు, మెదడు సక్రమంగా పనిచేయడం లేదు. ఆ ఎదిగిన అమ్మాయిని చూశావుగా, శిల్ప.. ఆమె వయస్సు ఇరవై దాటి ఉంటుంది, కాని ఆమెకు శరీర స్పృహ లేదు, నేచర్ కాల్సు కూడా పక్కల్లో చేస్తుంది. ఈ పాప మోతి... వయసు పదహైదు, కాని రెండేళ్ళ పిల్లలా ప్రవర్తిస్తుంది.." అంటూ తనకు తెల్సిన వారి పేర్లు, వాళ్ళ కష్టాలు చెప్పుకుంటూ పోయాడు.

ఇంతలో ఇన్‌ఛార్జి అయిన స్నేహ వచ్చింది, వారిని సాదరంగా ఆహ్వానించింది. శీను సుబ్బును పరిచయం చేశాడు. ఆమె అందంగా ఉంది.

"సారీ శీనుగారు ! పక్కగదిలో డాక్టరుగారు రాజీకి ట్రీట్‌మెంటు ఇస్తున్నారు, అందుకనే మిమ్మల్ని వెంటనే గమనించలేదు" చెప్పింది స్నేహ నవ్వుతూ.

"మీరు ఇక్కడే ఉంటారా?" సుబ్బారావు అడిగాడు.

"ఆ ! వీరితో పాటే ఉంటాను... వీళ్ళను కాపాడుతూ!" చెప్పింది స్నేహ.

"మైగాడ్ ! ఇక్కడి కొచ్చిన పావుగంటలో నాకు మెంటల్ వచ్చేట్లుంది. నరకం ఎక్కడో లేదు, ఇక్కడే ఉన్నట్లుంది. అటువంటిది ఎలా భరిస్తున్నారు?" అడిగాడు సుబ్బారావు.

"మరి నా పొట్టగడవాలి కదండి ! నా మీద ఆధారపడ్డ వాళ్ళను పోషించాలి గదండి ... పైగా వీళ్ళను చూస్తూ నాకున్న బాధలు మర్చిపోతాను. ఇక్కడికి రాకముందు లోకంలో నా అంత దురదృష్టవంతులు లేరనుకునేదాన్ని".

ఆమె మాటలకు అడ్డు తగిలాడు సుబ్బారావు "ఏ రకంగా దురదృష్టవంతులు!"

"చూడండి, తిండానికి తిండి కూడా ఉండేది కాదు. మానాన్నగారిది పెద్ద కుటుంబం. అందరం రోజుల తరబడి పస్తులుండేవాళ్ళం. కట్టుకోవడానికి మంచి బట్ట ఉండేది కాదు. అప్పుడనిపించేది, దేశంలో పెద్ద దురదృష్టం ఆర్థికలేమి అని. కాని ఇక్కడున్న చాలామంది పిల్లలు కోటీశ్వరులు. అంటే వారి తల్లిదండ్రులకు కోట్ల కోట్ల ఆస్తులున్నాయి" చెప్పింది స్నేహః

"అంత ఆస్తి పాస్తులుండి, ఇక్కడ వీళ్ళు అనాధలుగా ఎందుకు బ్రతుకుతున్నారు?" సుబ్బారావుకు అర్థం కాలేదు.

"హూ ! పెద్ద వాళ్ళకు వీళ్ళని చూసుకునే తీరిక ఉండద్దూ ! వీళ్ళని లాలించి

పెంచే తెలివి తేటలు ఉండద్దూ ! కాగా వాళ్ళకు పరువు సమస్య. తమ పిల్లలు ఇలా ఉన్నారని బయట తెలిస్తే తమకు తలవంపులు వస్తాయని భయం. అందుకే ఇక్కడ ఉంచి, అప్పుడప్పుడు వచ్చిపోతూ ఉంటారు, అడిగినంత డబ్బు అందచేస్తూ ఉంటారు" చెప్పింది స్నేహ.

" హూ ! ఎంత డబ్బిచ్చినా మానసిక వికలాంగులను పెంచడం తేలికైన విషయం కాదు. డబ్బిచ్చి వాళ్ళ అనుబంధం తెంచేసుకుంటున్నారు!" సుబ్బారావు ఆవేశపడ్డాడు. "ఊరికే కనిపారేశారు... మానవత్వం మరచిపోయారు!"

" ఈ కేర్ హోమ్‌లో జాయినయింతర్వాత నేను ఎంత అదృష్టవంతురాలినో తెలిసింది!" చెప్పింది స్నేహ ఆత్మవిశ్వాసంతో.

" ఏరకంగా ?" అర్థం గాక అడిగాడు సుబ్బారావు.

" దేవుడు నాకు కోట్ల ఆస్థితో సమాన విలువైన మెదడు ఇచ్చాడు. ఒకరిపై ఆధారపడకుండా నా జీవితం నేను బ్రతకగలను. ఒకరితో ఛీ కొట్టించుకోకుండా, అందరూ జాలి పడకుండా, పదిమంది తిట్టుకోకుండా, బ్రతకగల్గుతున్నాను. ఈ జన్మకిది చాలు" తృప్తిగా చెప్పింది స్నేహ.

" ఈ రెండు వేలు డొనేషన్ ఉంచండి. ఏవైనా స్వీట్లు తెప్పించి పంచండి." శ్రీనివాసు డబ్బులిస్తూ చెప్పాడు.

ఇంతలో ఒంటిమీద బట్టలు కూడా సరిగ్గా లేని ఒక పదేళ్ళ పాప వచ్చి 'అంకుల్' అంటూ సుబ్బారావును చుట్టేసింది. నోట్లోంచి చొంగ కారుతున్నది. ముక్కులోంచి చీమిడి కారుతున్నది. సుబ్బారావుకు ఒళ్ళు జలదరించింది. అతన్ని చూసి అదోరకంగా వంకరగా నవ్వింది. సుబ్బారావు ఆ పాపని వదిలించుకుని బయటకు నడిచాడు.

కాని శ్రీనివాసు ఆ పాపను తన చేతులతో ఎత్తుకుని లాలించి రూమాలుతో ముక్కు మూతి తుడిచాడు. ఇదంతా అసహ్యంగా దూరం నుంచి చూస్తున్నాడు సుబ్బారావు.

బయటకొచ్చింతర్వాత సుబ్బారావు శ్రీనివాసును అరిచాడు.

" లైఫ్ ఎంజాయ్ చేద్దామంటూ ఇక్కడికి తీసుకొచ్చావు. యూజ్‌లెస్ ఫెలో! నా మూడ్ అప్‌సెట్ అయింది. ఇవేం జీవితాలు. తిక్క జీవితాలు!"

" సారీ డొనేషన్ ఇచ్చి పోదామని వచ్చాం.. నువ్వు ఇంత సెన్సిటివ్ అని నేను అనుకోలేదు" సంజాయిషీ చెప్పాడు శ్రీనివాసు. ఇద్దరూ బండిమీద బయలుదేరారు.

★★★★★

మోటరు సైకిలును ఓ పెద్ద బిల్డింగు ముందు ఆపాడు.

లోపలికి తీసుకు వచ్చాడు. పెద్ద గార్డెన్ ఉంది. గార్డెన్‌లో చాలామంది చక్కటి

అమ్మాయిలు ఆటలాడుతున్నారు. టెన్నిస్, హ్యాండ్ బాల్, కబాడీ లాంటి ఆటలాడుతున్నారు. తిలక్ అక్షరాల్లాగా ఆడపిల్లలు వెన్నెల్లో ఆడుకుంటున్నారు.

అక్కడున్న రెండు కుర్చీల్లో కూర్చున్నారు ఇద్దరూ అందాలను ఆస్వాదిస్తూ.

ఇంతలో ఓ మెరుపుతీగ రెండు కూల్‌డ్రింక్సు తెచ్చింది. ఆమె అందానికి సుబ్బారావు అదిరిపోయాడు. క్లీన్ బౌల్డు!

" సుబ్బా ! ఈమె స్వప్న. చాలా బాగా పాడుతుంది, ఆడుతుంది. ఇతను సుబ్బారావు, నా ఫ్రెండు" పరిచయం చేశాడు శీను.

" స్వప్నగారూ ! కూర్చోండి, మీపాట వినాలని నా కోరిక!" సుబ్బారావు చెప్పాడు కుర్చీలో మెలికలు తిరుగుతూ.

వెంటనే స్వప్న ముత్యాలు రాలేట్లు నవ్వింది. వెన్నెల విరగబూసింది.

" సుబ్బారావుగారూ ! కోకిల కంటే నేనేం బాగా పాడలేను, నెమలి కంటే నేనేం బాగా ఆడలేను. ఏదో శ్రీనివాసు గారి అభిమానం. కాని నా గురించి తెలిస్తే ఇక్కడనుండి పారిపోతారు. నా గతం విని పాట పాడించుకుంటారా లేక ముందు పాడమంటారా?" అడిగింది స్వప్న.

" మీరంటే నాకెందుకో చాలా ఇదిగా ఉంది. మీకు గతం ఉందంటే నమ్మబుద్ధి కావడం లేదు. అయినా వినాలని ఉంది చెప్పండి" సుబ్బు సిగ్గుతో అడిగాడు.

" నా పేరు స్వప్న కాదు. నా తల్లిదండ్రులు పెట్టిన పేరు గీత. ఎందుకు లేండి, డబ్బుల కోసం పదేళ్ళ ప్రాయంలో వాళ్ళు నన్ను ఒకళ్ళకి అమ్మేశారు. వాళ్ళు నన్ను పెంచుకోవలసింది పోయి ... ముంబైలోని రెడ్‌లైట్ ఏరియాకు అత్యధిక లాభంతో అమ్మేశారు. దాంతో నా కష్టాలు ఏమని చెప్పను? ఒక అంగడి బొమ్మగా మారిపోయాను. పది మంది చేతుల్లో పువ్వులా నలిగిపోయాను.." అంటూ స్వప్న తన గురించి వివరించ సాగింది బాధపడ్తూ. వేశ్యా గృహంలో తను అనుభవించిన బాధలు చెప్పసాగింది.

సుబ్బారావు షాక్ తిన్నాడు... కలో నిజమో అర్థం కావడం లేదు.

" ఈ మధ్యే పోలీసులు నన్ను రక్షించి తెచ్చి ఇక్కడ వదిలిపెట్టారు. కాని నాకు తెల్సు, నేను ఎక్కువ కాలం బ్రతకను అని" చెప్పింది స్వప్న రోదిస్తూ.

" ఏం ? ఎందుకు? ఇక్కడ బాగోలేదా?" అడిగాడు సుబ్బారావు.

" కాదు ... నాకు ఎయిడ్స్ వచ్చింది.." స్వప్న చెప్పింది.

అంతే, బాంబు వేసినట్లు అదిరిపడ్డాడు సుబ్బారావు! తాగుతున్న కూల్‌డ్రింకు చేతిలోంచి జారి కిందపడిపోయింది. మొహం పాలిపోయింది. కుర్చీ దూరంగా జరుపుకుని కూర్చున్నాడు. అతని చేతులు వణుకుతున్నాయి.

స్వప్న నవ్వింది. "కంగారు పడకండి, ఎయిడ్స్ మీకు రాదు, ఆ కూల్‌డ్రింకు ద్వారా రాదు, నా గాలి ద్వారా రాదు, నేను మిమ్మల్ని తాకలేదు, తాకినా రాదు. నా గురించి తెలిసీ శ్రీనివాసు గారు తరచూ వచ్చి పలకరిస్తూ ఉంటారు".

" శీను ! వెళదాం, నా మనసు బాగోలేదు". సుబ్బు కంగారుగా లేచి అన్నాడు.

" అదేండి సుబ్బు ! స్వప్న కాకపోతే ఇక్కడ చాలా మంది అందమైన అమ్మాయిలున్నారు, వారితో మాట్లాడి ఎంజాయ్ చేస్తావనుకున్నాను".

" అస్సలు వీళ్ళంతా ఎవరు? ఎందుకొచ్చారు?" ప్రశ్నించాడు సుబ్బారావు.

" వీరంతా విధి వంచితులు. జీవితంలో నరకం అనుభవించినవాళ్ళు. ప్రభుత్వం వీరిని రక్షించి, కొత్త జీవితాన్ని ఇస్తున్నది. వీళ్ళల్లో చాలామంది వృత్తి పనులు నేర్చుకుని స్వంతంగా సంపాదించుకుంటున్నారు. జీవితంలో నిజమైన దురదృష్టం ఎలా ఉంటుందో నాకు స్వప్నను చూస్తే తెలుస్తుంది. నయవంచకుల చేతిలో మోసపోయి అటు తల్లిదండ్రుల ఆదరణ లేక, సమాజానికి చెత్తకుండీలా తయారై, చిన్న వయసులోనే తన ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుని, రకరకాల జబ్బులతో బాధపడుతూ, అయినా ఎదుటి వారికోసం చిరునవ్వులు చిందిస్తూ బ్రతుకుతున్నది... ఇలా ఇక్కడున్న అమ్మాయిలతో నువ్వు మాట్లాడ గలిగితే వారి జీవితాలు చదవగలిగితే ... దేవుడు మనకు ఎంత అదృష్టం ఇచ్చాడో అర్థం అవుతుంది" అంటూ శీను సుబ్బారావును తీసుకుని సాయిబాబా గుడికి వెళ్ళాడు.

★★★★★

బాబా దర్శనం చేసుకుని బయటకు వస్తూ వుంటే ముష్టివాళ్ళు వెంటబడ్డారు. కొంత చిల్లర సుబ్బారావు వద్దన్నా శ్రీనివాసులు పంచిపెట్టాడు.

దూరంగా ఓపిక లేక రోడ్డుమీద కూర్చున్న వృద్ధ దంపతుల దగ్గరికి వచ్చాడు. జేబులోంచి వంద రూపాయలు తీసి వారికిచ్చాడు. వాళ్ళు దణ్ణం పెట్టారు...

" ఛీ ! నీకు డబ్బు విలువ తెలియదు. అడుక్కుతినే వాళ్ళకు వంద ఏస్తావా?" సుబ్బారావు శీను పనిని ఖండించాడు. "అందుకే మన దేశంలో ముష్టివాళ్ళు పెరిగిపోతున్నారు" వ్యాఖ్యానించాడు.

" సుబ్బారావ్ ! నువ్వు అడుక్కుతినే వాళ్ళు అన్నావు చూడు, వాళ్ళు ముష్టివాళ్ళు కాదు, కోటీశ్వరులు !" చెప్పాడు శ్రీనివాసు.

" ఆ ! మరి ఇదేం ఖర్మ ?" ఆశ్చర్యపోయి అడిగాడు సుబ్బారావు.

" నువ్వే అన్నావుగా ఖర్మ అని - పిల్లల్ని నమ్మి తమ కోట్ల ఆస్తి ముందుగానే పంచిపెట్టారు. తరువాత పెళ్ళిళ్ళు అయి కోడళ్ళు వచ్చిన తర్వాత పిల్లల నిజస్వరూపం బయటపడింది! నిరాదరణకు గురై, ఆత్మని చంపుకుని అక్కడ బ్రతకలేక దేశాలు పట్టుకు

తిరుగుతున్నారు పారిపోయి వచ్చి' శీను చెప్పాడు.

" నిజమే కాని ... ఇంక బ్రతికి ఏం సాధించాలని ఈ ముసలాళ్ళు బ్రతికి ఉన్నారు?" సుబ్బారావు మొహం అదోలా పెట్టి అడిగాడు.

" ఏమో .. సాయినాధుని దయవలన పిల్లల మనసులు మారి తమను ఆదరిస్తారన్న ఆశ కావచ్చు... ఇలా ఇక్కడున్న అడుక్కుతినే వాళ్ళను కదిలిస్తే వాళ్ళ జీవితాల కథ చెబుతారు. అప్పుడనిపిస్తుంది మనం ఎంతో అదృష్టవంతులమని!

ఆహా ! కనీసం మన కాళ్ళమీద మనం బ్రతకగలుగుతున్నాం. ఇతరుల చేత ఛీ కొట్టించుకోకుండా బ్రతక గలుగుతున్నాం.-పంచభక్ష్య పరమాన్నాలు కాకపోయినా రెండు పూటలా కడుపు నింపుకోగలుగుతున్నాం. ఇలా గుడి ముందర కూర్చుని ఎవరు పైసలు వేస్తారా... ఎలా కడుపు నింపుకోవాలా అని ఎదురు చూడకుండా ప్రశాంతంగా గడప గలుగుతున్నందుకు నేను భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" శ్రీనివాసు చెప్పాడు. అతని కళ్ళు చెమర్చాయి. గుడికి భక్తితో నమస్కరించాడు.

★★★★★

ఆ తరువాత ... మంచి హోటల్లో భోజనం పెట్టించి బైకు మీద సుబ్బారావును శ్రీనివాసు అతని రూము దగ్గర వదిలేసి మరునాడు ప్రొద్దున తయారై ఉంటే అలంపురం తీసుకుపోతానన్నాడు. శీను వెళ్ళింతర్వాత సుబ్బారావుకు ఓ పట్టాన నిద్ర పట్టలేదు. స్నేహ.. ఆమె సేవలు చేస్తున్న మానసిక వికలాంగులు పదే పదే గుర్తుకొచ్చారు. స్వప్న కలలోకి వచ్చి కలవరపరిచింది. వెన్నెల్లో ఆడుకుంటున్న ఆడపిల్లల జీవితాలలో పండువెన్నెల ఉందా! గాఢ నిద్ర పట్టిందో లేదో, అడుక్కు తింటున్న వృద్ధ దంపతులు కలలోకి వచ్చారు. తనను నమ్ముకున్న తల్లిదండ్రులు గుర్తుకొచ్చారు.

దాంతో సుబ్బారావుకు నిద్ర మత్తు వదిలి లేచి కూర్చుని తన కాలకృత్యాలు తీర్చుకుని... ఊరికి తీసుకుపోవలసిన తన సూటుకేసు సర్దుకున్నాడు... ముఖ్యమైన కాగితాలు భద్రపరచుకున్నాడు. తన రూమును బెంగగా చూసుకున్నాడు.

శ్రీనివాసు రానే వచ్చాడు. " కమ్మటి బ్రేక్ ఫాస్టు చేసి అలంపురం బయలు దేరుదాం.." చెప్పాడు.

" జోగులాంబ అమ్మవారిని చాలా సార్లు చూశాను" సుబ్బారావు చెప్పాడు.

" ఆ అమ్మవారి గురించే కాకుండా ... నా స్వార్థం కూడా ఉంది.. అక్కడ కోటి రూపాయల పాలసీ వచ్చేది ఉంది. పద పద" శీను బలవంతం మీద సుబ్బారావు అతని బండిమీద బయలు దేరాడు. కొన్ని గంటల తర్వాత...

దర్శనం చేసుకుని... లోకనాథం ఇంటికి వచ్చారు.

శ్రీను మాట్లాడిన కాసేపటికి అతను ప్రపోజలు కాగితాల మీద సంతకం పెట్టాడు.... లెక్క తెచ్చి శ్రీనివాసుకిచ్చాడు. యాభై లక్షల పైన డబ్బులు శీనుకిచ్చాడు. అంత రొక్కం చూసే సరికి సుబ్బారావుకు మతిపోయింది.

" ఇంత డబ్బును శ్రీనివాసుకు ఏం నమ్మి ఇస్తున్నారు?" సుబ్బారావు అడిగాడు.

" అతను నా పాలిట దేవుడు... ఓ అయిదేళ్ళ క్రిందట నేను బీదరైతును. అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకోబోతే నన్ను ఆదుకున్నాడు. కాలం ఎప్పుడూ ఒకేలాగుండదని, మంచికాలం ముందుందని ధైర్యం చెప్పాడు. అతను చెప్పినట్లే కొన్నాళ్ళకు రింగు రోడ్డు పుణ్యమాని నా పోరంబోకు పొలాలకు కోట్ల ధర పలికింది... ఒక్క సంవత్సరంలో పేద రైతును కాస్త కోటీశ్వరుడనై పోతాను" అంటూ తన కథ మరింత వివరంగా చెప్పాడు లోకనాథం.

" కాళ్ళు చేతులు లేనివాళ్ళే బ్రతుకుతున్నప్పుడు మనం ఎందుకు బ్రతకలేమండి? షెల్లీగారన్నట్లు 'ఇఫ్ వింటర్ కమ్స్ కెన్ స్ప్రింగ్ బి ఫార్ బిహైండ్ !" అంటే "శిశిరం వచ్చింతర్వాత వసంత రాకుండా మానుతుందా? కష్టాలు వచ్చినప్పుడు ఓర్పు వహించాలి" ఆ మాటలు సుబ్బారావుకు ఎక్కడో గుచ్చుకున్నాయి.

★★★★★

ఆ సాయంత్రం శీను సుబ్బారావును తన రూములో వదిలేశాడు. " ఏరా సుబ్బా .. ఆత్మహత్య ఎప్పుడు చేసుకుంటావు?" అడిగాడు.

" సారీరా శీను. ఇంకెప్పుడూ అలా ఆలోచించను. నాకేం తక్కువైందిరా ! దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు. స్వప్న, స్నేహ లాంటి దురదృష్టవంతులు, విధి వంచితులైన ముష్టివాళ్ళు బ్రతుకుతుండగాలేంది నేనెందుకు చావాలి! జీవితం నుంచి పారిపోకూడదు. ఎదిరించి పోరాడి విజయం సాధించాలి! విజయం ఆలస్యం కావచ్చు, కాని దాని ఫలాలు మధురంగా ఉంటాయి. థ్యాంక్సురా శీను... నువ్వు బీమా ఏజెంటువే కాదు, నా జీవితానికి ఒక థీమా ఇచ్చావు! నాకు కనువిప్పు కలిగించావు నా ఆలోచనల్లో మార్పు తెచ్చావు" సుబ్బారావు గాద్గదికంగా చెప్పాడు.

" సుబ్బా ! అనవసరంగా మనం దేవుడ్ని నిందిస్తాము... మనల్ని దురదృష్ట వంతులుగా పుట్టించాడని, కాని అది అబద్ధంరా! నీ విలువ తెలుసుకుంటే కోటీశ్వరుడివి ! దేవుడికి పక్షపాతం లేదు. అందరికి అన్ని అవయవాలు సక్రమంగా ఇస్తున్నాడు. సూపర్ కంప్యూటర్ కంటే ఎన్నో రెట్లు వేగంగా పనిచేయ గలిగిన నీ మెదడు ఖరీదు కొన్ని వందల కోట్లు... కొన్ని వందల లీటర్లను ఫిల్టరు చేయగలిగిన నీ కిడ్నీల ఖరీదు కొన్ని లక్షలు! ఎన్నో వేల మైళ్ళు రక్తాన్ని పంపు చేయగలిగిన నీ గుండె ఖరీదు లక్షలు! ఇలా

దేవుడిచ్చిన అవయవాలకు ఖరీదు కడితే మనం నిజంగా కోటీశ్వరులం! అవి సక్రమంగా వాడుకోలేక పోతే నిజంగా మనం దురదృష్టవంతులమే కాదు... బీదవాళ్ళం కూడా! అందుకే ఆత్మహత్య చేసుకునే ముందు ఒక్కసారి ఆలోచించండి. అమూల్యమైన, కోట్ల విలువ చేసే దేవుడిచ్చిన ఆస్తిని వ్యర్థం చేసుకోకండి" శ్రీనివాసు చెప్పాడు. అదీగాక మన బాధలు, కష్టాలు మనం పూర్వజన్మలో చేసిన పాపాల ఫలితం. అనుభవించక తప్పదు, పారిపోలేము. ఒక ఖైదీ జైలు నుంచి తప్పించుకుని పారిపోతే, దొరికిన తర్వాత అతనికి మరింత కఠిన శిక్ష విధిస్తారు. అలాగే మనకు రాయబడిన బాధలనుండి తప్పించు కోవడానికి ఆత్మహత్య చేసుకుంటే మరు జన్మలో రెట్టింపు బాధలు అనుభవించాల్సి వస్తుంది" కర్మ సిద్ధాంతం వివరించాడు శీను.

" సారీరా శీను ! నాలాగా డిప్రెషన్‌లో పడ్డ యువతను సరైన సమయంలో సరైన సలహా ఇస్తే, ఆత్మహత్య అన్న తలంపు ఎవరూ చేయరు. నువ్వన్నట్లు బ్రతికి ఉంటే మంచి రోజులు వాటంతటవే వస్తాయి ! అంతదాకా ఓపికగా ఎదురుచూస్తూ ఉండాలి. థ్యాంక్యూ!" సుబ్బారావు శీనుకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

" సుబ్బా ! నీకో నిజం చెప్పకపోతే నాకు నిద్ర పట్టదు. కేర్ హోంలో అంకుల్ అంటూ నిన్ను వాటేసుకున్న పాప గుర్తుందా? అది ఎవరో కాదు, నా పాపేరా! దాన్ని అనాథలాగా వదిలివేసిన కసాయి తండ్రిని నేనేరా!" శ్రీనివాసు ఏడుస్తూ చెప్పాడు. "వైద్యం అభివృద్ధి చెంది, మానసిక వికలాంగులను మామూలు మనుషులుగా చేసే రోజు వస్తుందని ఆశపడుతున్నాను. ఆ రాబోయే వసంతంలో నా పాపను నేను ఇంటికి తెచ్చుకుంటాను."

సుబ్బారావు నిశ్చేష్టుడై పోయాడు. "ఆ !" అని నోరు తెరిచాడు.

" అందుకే నా పాపానికి ప్రాయశ్చిత్తంగా దానాలు ఇస్తూ వస్తున్నది.. ఒకే! థ్యాంక్యూ!" చెప్పి బైకు మీద వెళ్ళిపోయాడు శ్రీనివాసు.

సుబ్బారావు తేరుకొనే సరికి శ్రీనివాసు లేదు. సుబ్బారావు కూడా రాబోయే వసంతం కోసం నిరీక్షించ దల్చుకున్నాడు.

– ధ్యానమాలిక నవంబరు 2007